మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయ లోని మహిళా డిగ్రీ కళాశాలలో 2024- 25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ పి.చలపతిరావు తెలిపారు. కళాశాలలో మొదటి కౌన్సిలింగ్ లో సీటు పొందిన విద్యార్థినులంతా ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలన చేసుకొని అడ్మిషన్లు పొందాలన్నారు. మొత్తం 280 సీట్లకు గాను ఇప్పటికే 255 మంది మొదటి కౌన్సిలింగ్ లో సీట్లు పొందినట్లు తెలిపారు. ఈనెల 16 వరకు అడ్మిషన్లు జరుగుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అడ్మిషన్లు నిర్వహిస్తున్న కాలేజీ సిబ్బంది

పెట్టుబడి సాయం హామీని అమలు చేయాలి

రైతులతో కలిసి వరినాట్లు వేస్తున్న సిపిఎం నేత చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-చింతపల్లి: రైతులకు రూ.20వేలు పెట్టుబడి సాయం ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోనంగి చిన్నయ్యపడాల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తాజంగి పంచాయతీ వంతమామిడి గ్రామంలో పర్యటించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి వరి నాట్లు వేసిన చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన పెట్టుబడి సాయం హామీ అమలుకు ఖరీఫ్ సీజన్లో రైతులు ఎన్నో ఆశల ఎదురు చూస్తున్నారని, తక్షణమే అమలు చేయాలని కోరారు. రైతులు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే, వారి ఆశలపై నీళ్లుచల్లడం సరికాదన్నారు. రైతుల ఖాతాల్లో తక్షణమే పెట్టుబడి సాయం జమతోపాటు లక్షల లోపు పంటరుణాలను మాఫీ చేసి, రైతు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు వనము బాలు, బి తెల్లన్న పడాల్, ఎం చిన్నబాబు, రైతులు పాల్గొన్నారు.

21న విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు

సమావేశంలో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు : ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఈనెల 21న బేస్ లైన్ పరీక్షలు నిర్వహించాలని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో గిరిజన సంక్షేమాధికారులు, విద్యాశాఖ అధికారులతో బేస్‌లైన్ పరీక్షల నిర్వహణ, విధివిధానాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈనెల 17,18 తేదీల స్కూలు కాంపెక్స్ పరిధిలోని ఎంఇఒలు ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి బేస్‌లైన్ ఎగ్జామ్ నిర్వహణపై అవగాహన కల్పించాలని గిరిజన సంక్షస్త్రమ ఉప సంచాలకులు, డిఇఒలను ఆదేశించారు. ప్రశ్నా పత్రాల తయారీ, జవాబు పత్రాల మూల్యాంకన పారదర్శకంగా జరగాలన్నారు. బేస్‌లైన్ పరీక్ష నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించాలని సూచిచచారు. బేస్‌లైన్‌లో సాధించిన మార్కులు ఆధారంగా విద్యార్థులను ఎబిసిడి గ్రూపులుగా విభజించాలని, సి,డి కేటగిరీల్లో నిలిచిన విద్యార్థులపై ప్రత్యే శ్రద్ధ తీసుకుని విద్యా ప్రమాణాలు మెరుగుపరచి ఎబి గ్రేడ్లకు తీసుకుని రావాలని సూచించారు. . సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, ఎటిడబ్ల్యూ ఒ ఎల్.రజని, ఎంఇఒ సరస్వతి పాల్గొన్నారు

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో సంఘాల సూచనలు తీసుకోవాలి

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న ఫ్యాప్టో నేతలు

ప్రజాశక్తి.-చింతపల్లి:పాఠశాల విద్య, పని సర్దుబాటు ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య మండల, జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వాన్ని కోరుతూ సోమవారం స్థానిక మండల విద్యాశాఖాధికారి ప్రసాద్‌కు వినత్డిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిఒ 117, 128 ఆధారంగా పనిసర్దుబాటు చేయడం సరికాదని, పని సర్దుబాటు ప్రక్రియకు తాము తెలిపే అంశాలు పరిగణనలోకి తీసుకోవాలని జిఒ 117, 128 ద్వారా కాకుండా 2020లో విడుదల చేసిన జిఒ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, సీనియర్ల విల్లింగ్ అవకాశం కల్పించాలని, సీనియార్టీని లెక్కించినప్పుడు ప్యానల్ నంబర్ లేదా ర్యాంకును పరిగణనలోకి తీసుకోవాలన్నారు. దీన్ని మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలని కోరారు. పని సర్దుబాటులో సొంత యాజమాన్యాలలోని పాఠశాలల్లో ఖాళీల భర్తీలో ఉపాధ్యాయులకు ప్రాధాన్యతనిచ్చి, తర్వాత ఇతర యాజమాన్యాల పాఠశాలల్లో నియమించాలన్నారు. 70శాతం పైబడి అంగవైకల్యం కలిగిన ఉపాధ్యాయులను, 2025 ఏప్రిల్ 30లోపు ఉద్యోగ విరమణ చేసేవారిని ఈ పని సర్దుబాటు నుండి మినహాయించాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలన్నారు. 6వ తరగతి నుండి 10వ తరగతులు 10 సెక్షన్లు దాటిన సందర్భంలో 2వ హిందీ, 2వ పిఎస్ పోస్టులను కేటాయించాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో జిఒ 60 మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలన్నారు. ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణనలోకి తీసుకోకుంటే, పని సర్దుబాటు ప్రక్రియకు సహకరించబోమని, బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఫ్యాప్టో నాయకులు గిడ్డి వరలక్ష్మి, భౌడు గంగరాజు, కుడుముల వెంకటరమణ, గెమ్మెలి మోహనరావు, లోచలి చిట్టి నాయుడు, పురసకారి రమణమూర్తి నాయుడు, గెమ్మెలి కామేశ్వరరావు, గడుతూరి రాంబాబు పాల్గొన్నారు.

పౌష్టికాహార పంపిణీలో నిర్లక్ష్యం!

ప్రజాశక్తి -పాడేరు : ఐసిడిఎస్ అధికారుల పర్యవేక్షణా లోపంతో పెదబయలు మండలం మారుమూల ఇంజరి, కొంద్రం, జమదంగి, కుమ్మరిగుంట, గిన్నెలకోట, తల్లబు జామిగూడ ప్రాంతాలకు నెల రోజులుగా అంగన్వాడీ కేంద్రాల లబ్ధిదారులకు గుడ్లు, ఇతర పౌష్టికాహార సరుకులు, బాలామృతం ప్యాకెట్లు సక్రమంగా అందడం లేదని ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ వెల్లడించారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ సంఘం ప్రతినిధులు ఆయా గ్రామాల్లో పర్యటించిన సందర్భంలో లబ్ధిదారులు ఈవిషయాన్ని తమ దృష్టికి తెచ్చారన్నారు. అంగన్వాడీ లబ్ధిదారులకు ఇస్తున్న గుడ్లు సైజు చాలా చిన్నదిగా ఉంటోందని, ముక్కిపోయిన బెల్లం, పప్పులు, ఇతర సరుకులు పంపిణీ చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నాసిరకపు, తక్కువ పరిమాణం సరుకులు గుడ్లు,సరుకులు పంపిణీ చేస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది తమకేమీ పట్టనట్లు వ్యవహరిండం దుర్మార్గమన్నారు. తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన సమాఖ్య నేత లక్ష్మణరావు ఉన్నారు.

నాటు పడవలో వెళ్లి వైద్యసేవలు

- మారుమూల కుమ్మరిపుట్టులో వైద్యశిబిరం
- అవస్థలు పడుతూ గ్రామానికి వెళ్లిన వైద్యులు, సిబ్బంది, ప్రజాసంఘాల నేతలు
- వంతెన నిర్మించాలి: ఆదివాసీ గిరిజన సంఘం

నాటుపడవలో కుమ్మరిపుట్టు వెళుతున్న వైద్యులు, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : వీడకుండా విస్తృతంగా కురుస్తున్న వర్షాలు, వాతావరణ మార్పులతో మారుమూల గ్రామాల్లో గిరిజనులు జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో మండలంలోని సుజనకోట పంచాయతీ మారుమూల కుమ్మరిపుట్టు గ్రామంలో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి నేరుగా వెళ్లే మార్గంలో లేకపోవడంతో నిండుకుండలా ఉన్న కుమ్మరిపుట్టు వాగులో నాటుపడవలపై వైద్యులు, సిబ్బందితోపాటు ప్రజాసంఘాల నేతలు ప్రమాదభరిత ప్రయాణం చేసి, గ్రామానికి తరలివెళ్లి గిరిజనులకు వైద్యసేవలు అందించారు.

శ్రీశ్రీ ఇన్‌ఫ్రా ట్రస్ట్ సౌజన్యంతో ఆదివాసీ గిరిజనసంఘం, శారద ట్రస్టు, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, జనస్వస్థ్య అభియాన్ అనుబంధ ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో మారుమూల కుమ్మరిపుట్టులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న125 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ పట్నం జిల్లాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో 14 గ్రామాల ఆదివాసీ రోగులకు సుగర్, బిపి, మలేరియా, డయేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులకు రక్త పరీక్షలు చేసిఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ ఇన్‌ఫ్రా ఎమ్‌డి ఎస్.శ్రీనివాసరావు, ప్రజా ఆరోగ్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి, ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులతో వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కుమ్మరిపుట్టు వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో కిలాగ ఆరోగ్య కేంద్ర డాక్టర్ శిరీష, కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎస్.గాసిరం దొర, ఎం.ఎం.శ్రీను, కె.సర్వయ్య,వైస్.ఎంపిపి సత్యనారాయణ, రామదాసు, శ్రీను, ధనుం.య, భాగిరథి, గురుమూర్తి, వైద్య సిబ్బంది నాగరాజు, అశోక్, లలిత, రోహిణి, తులసీరత్నం, ఉషారాణి, రాజులమ్మ దీప్తి రాణి, ఆశాలు పాల్గొన్నారు.

కుమ్మరిపుట్టులో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

కుమ్మరిపుట్టు వంతెన నిర్మించాలి

- ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్

వర్షాల సీజన్‌లో ఉప్పొంగి, ఉధృతంగా ప్రవహించడంతో బాహ్య ప్రపంచానికి సంబంధాలు తెగిపోయేలా చేస్తున్న కుమ్మరిపుట్టు వాగుపై వంతెన నిర్మించి ఆదుకోవాలని గిరిజన గ్రామ ప్రజలను ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. సీజన్‌లో విషజ్వరాలు ప్రబలితే వైద్యానికి, గర్భిణులు ప్రసవానికి, ఇతర అత్యవసర పరిస్థితుల్లో కుమ్మరిపుట్టు ప్రాంతవాసులు నిత్యం అనుభవిస్తున్న కష్టాలను నేడు వైద్యశిబిరం నిర్వహణకు వెళ్లిన వైద్యబృందానికి, ప్రజాసంఘాలు ఇతర నేతలకు అడిగితే తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించాలని, ఇప్పటికే ఏళ్ల తరబడి ప్రతిపాదనలో ఉన్న కుమ్మరిపుట్టు రేవులో వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ఉచిత డిఎస్‌సి శిక్షణకు విశేష స్పందన

ప్రజాశక్తి -పాడేరు: ఐటిడిఏ ఆధ్వర్యంలో గిరిజన యువతీ యువకులకు అందిస్తున్న ఉచిత డిఎస్‌సి శిక్షణకు విశేష స్పందన వచ్చిందని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ స్పష్టం చేసారు. సోమవారం ఐటిడిఎ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులను పంపిణీ చేసామన్నారు. మొదటి రోజు 410 దరఖాస్తులను అభ్యర్థులకు పంపిణీ రిగిందన్నారు. తిరిగి ఎవరూ దరఖాస్తులను సమర్పించలేదన్నారు. ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులు పంపిణీ స్వీకరణ, అనంతరం ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. డిఎస్‌సికి అర్హతలు ఉన్న గిరిజన యువత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిఒ కోరారు. డిఎస్‌సిలో ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు

కోరం లేక మండల సమావేశం వాయిదా

ప్రజాశక్తి -అనంతగిరి : స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం సభ్యుల గైర్హాజరుతో కోరం లేక వాయిదా పడింది. మండలంలో 14మంది ఎంపిటిసి సభ్యులుండగా, వారిలో 10మంది వైసిపి సభ్యులు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పత్యేక క్యాంపునకు వెళ్లిపోయారు. ఇక టిడిపికి ముగ్గురు, బిజెపికి ఒకరు ఎంపిటిసి సభ్యులున్నప్పటికీ, వారు సమావేశానికి రాలేదు. దీంతో సభ్యుల గైర్హాజరుతో కోరం లేక మండల సర్వసభ్య సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపిడిఒ నగేష్ ప్రకటించారు. ఎపుడు నిర్వహించేదీ తర్వాత వెల్లడిస్తామన్నారు.

వివిధ శాఖల ద్వారా పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని వివిధ శాఖలకు సంబంధించిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లలకు ప్రభుత్వ నిబంధన ప్రకారం పౌష్టికాహారం అందజేయాలన్నారు. గిరిజన సంక్షేమ, హౌసింగ్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఏజెన్సీలో మలేరియా ప్రబలకుండా ఎక్కడికక్కడ మలేరియా స్ప్రేయింగ్ చేయించాలని సూచించారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. ఉపాధి జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి కూలీ పనులు కల్పించాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ ద్వారా ఏజెన్సీలోని ప్రజలకు కరెంట్ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు ఏ మొక్కలు సరఫరా చేస్తున్నారో ఆరా తీశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ పేషెంట్లకు తాగునీరు ఏ విధంగా ఏర్పాటు చేస్తున్నారో పరిశీలించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ ద్వారా ఏజెన్సీలో చేపట్టే కార్యక్రమాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ సిహెచ్ శ్రీనివాసరావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, ఏడిఎంహెచ్ఓ జి.శిరీష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జి.డేవిడ్ రాజ్, ఎండి యూసఫ్, రవికుమార్, ఎడిఎలు సిహెచ్‌కెవి చౌదరి, సావిత్రి, ఏపీడీలు జి.శ్రీనివాసరావు, ఏ శ్రీనివాసరావు, పీహెచ్ఓ చిట్టిబాబు, సిడిపిఓ సంధ్యారాణి, తాసిల్దార్ కృష్ణ జ్యోతి, డాక్టర్ ఇందిరా, డిఇలు సాయి సతీష్, రాజేంద్ర బాబు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

మండల పరిషత్తు సమావేశానికి అధికారుల గైర్హాజరుపై నిలదీత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోవడంపై సభ్యులు నిలదీశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పలువురు అధికారులు గైరాజర్ అవడంతో ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. సమావేశం అంటే టీ తాగి, సమోసాలు తినేసి వెళ్లిపోవడమా అని ప్రశ్నించారు, ప్రతిసారి మండల సమావేశం నిర్వహించుకుంటున్నాం తప్ప సమావేశంలో వచ్చిన సమస్యలపై అధికారులు దష్టి సారించడం లేదని లబ్బర్తి, దూసరపాము, చెరుకుంపాలెం, ఎంపిటిసిలు గొల్లపూడి పెద్దిరాజు, నల్లా సత్యనారాయణ, ఎం సుబ్బారావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పనులు అసంతృప్తిగానే ఉన్నాయన్నారున. మండలంలో వేలాపాల లేకుండా విద్యుర్తు కోతలతో తీవ్ర అంతరాయం తరచూ జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామాల్లో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉందని, విద్యుత్తుగా అంతరాయం ఏర్పడిన క్రమంలో అధికారులు స్పందించడం లేదని జడ్డంగి, గడువటకుర్తి, మారేడుబాక సర్పంచులు కొంగర మురళీకృష్ణ, ఎస్ చంద్రుడు, టీ ఆదినారాయణ తదితరులు అధికారులను నిలదీశారు, ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే తల్లిపాల వారోత్సవాలు ప్రజాప్రతినిధులకు తెలపకపోవడంపై సంబంధిత అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, వీధి రోడ్లు, పారిశుధ్యం వంటి సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని చికిలింత సర్పంచ్ కొండ్ల సూరిబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, వైస్ ఎంపీపీలు చప్పా సూర్యచంద్రరాణి, జుర్రా రాజేశ్వరి, రాజవొమ్మంగి సర్పంచ్ జి రమణి, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, డిటి సత్యనారాయణ, వైద్యాధికారులు సుష్మ, ఉషశ్రీ, పలువురు ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

పివిటిజి గ్రామాలకు రక్షిత మంచినీటిని సరఫరా చేయాలి

- గాలికొండ ఎంపిటిసి సభ్యులు బుజ్జిబాబు

ప్రజాశక్తి-సీలేరు

ఆర్‌వోఎఫ్ ప్లాంట్ నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేసి రక్షిత మంచినీటిని పివిటిజి గిరిజన గ్రామాలకు తక్షణమే సరఫరా చేసే విధంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో సోమవారం ఆయన మాట్లాడుతూ జీకే వీధి మండలం, జీకే వీధి పంచాయతీ పరిధి పీకే గూడెం, పాములాయి, కుంకుమపూడి తదితదర పివిటిసి గ్రామాల్లో పాడేరు ఐటిడిఎ ద్వారా 2021-22 సంవత్సరంలో రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులు చేపట్టారని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి సౌకర్యం కల్పించండి మహాప్రభో అంటూ అనేకసార్లు అధికారులకు విన్నవించినా నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదని వాపోయారు. నిర్మాణం పనులు నిలిచిపోవడానికి గల కారణాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి పివిటిజిలకు మంచినీటి సరఫరా చేయాలని కోరారు. పివిటిజిలు మంచినీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారని, వాగులు, ఊట గెడ్డల నుంచి సేకరించిన నీటిని తాగడంతో రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఐడిటిఐ పిఓ అభిషేక్ స్పందించి మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు ముక్కల మహేష్, గంటా బుజ్జిబాబు, గ్రామస్తులు జి.కామేశ్వరరావు, దావీదు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

జెండాను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎన్‌ఇపితో విద్య కార్పొరేటీకరణ

- యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-చింతూరు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన విద్యా విధానం (ఎన్‌ఇపి) విద్య కార్పొటీకరణ, ప్రైవేటీకరణకు ఆజ్యం పోస్తుందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.కృష్ణయ్య, యు.వెంకటనారాయణ అన్నారు. యుటిఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక యుటిఎఫ్ భవన్‌లో సంఘం జెండాను సోమవారం యుటిఎఫ్ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ యం.కవిత ఆవిష్కరించారు. అనంతరం యుటిఎఫ్ మండల అధ్యక్షులు యం.సోమరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టే పోరాటాలకు యుటిఎఫ్ కేంద్ర బిందువుగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల సేవలో తరిస్తోందని, రైతులు, కార్మికులు, మధ్య తరగతి ఉద్యోగుల, మహిళలు, విద్యార్థులు తదితరుల సమస్యల పరిష్కారం కోసం ఏమాత్రం కషి చేయడం లేదని విమర్శించారు. విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్ట పెట్టేందుకు తీసుకొచ్చిన వినాశకర యన్‌ఇపిని ప్రతిఘటించడానికి ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు తులసి, రాజారావు, కన్నారావు, జగదీష్, బ్రహ్మయ్య, వరలక్ష్మి, రాంబాబు పాల్గొన్నారు.

సీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యారులు, సిబ్బంది

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-సీలేరు

మత్తు పదార్థాలకు యువత అలవాటు పడి నిండు జీవితాలు నాశనం చేసుకోవద్దని జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.శంకర్రావు పిలుపునిచ్చారు. జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ద్వారా మత్తు పదార్థాల్ని విడనాడి ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ సోమవారం ర్యాలీ చేపట్టారు. స్థానిక మెయిన్ రోడ్డులో మానవహారంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై జె.రామకృష్ణ మాట్లాడుతూ గంజాయి, ఖైనీ, మద్యం, గుట్కా, కొకేను వంటి మత్తు పదార్థాలకు విద్యార్థి దశలోనే బానిసై నిండు జీవితాన్ని బొగ్గు పాలు చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు విద్యార్థి దశ ప్రారంభం నుంచే పిల్లలకు క్రమశిక్షణ అలవర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కామర్స్ లెక్చరర్ డి.శ్రీను, ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, పలువురు రాజకీయ నాయకులు, సీలేరు పిహెచ్సి సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దారు చలపతిరావుకు వీడ్కోలు సన్మానం

ప్రజాశక్తి-దేవీపట్నం

మండల తహశీల్దారు పివి.చలపతిరావు బదిలీ అయిన సందర్భంగా సోవవారం ఆయన్ను ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంటగా కొండ దొరల సంఘం జిల్లా నాయకులు యలగాడ నాగేశ్వరరావు, ఆదివాసి జేఏసీ రాష్ట్ర నాయకులు తెల్లం శేఖర్, కారం రామన్న దొర మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో మండల తహశీల్దారుగా వచ్చిన పివి.చలపతిరావు అనతి కాలంలోనే అమాయక ఆదివాసీలకు మెరుగైన సేవలు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దూసరి హరిబాబు, టెంకి రాంబాబు, కొర్లాపు శ్రీధర్, మన్నేపల్లి కనకారావు, మూలపర్తి ఈశ్వర్ దొర, బండారు వీరబాబు, కొట్టు బన్నీ, మేక భాను, పెదకాపు చక్రం, పచ్చుకూరి గౌరీ శంకరుపాల్గొన్నారు.

చలపతిరావును సన్మానిస్తున్న నాయకులు

మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం

పాడేరులో మాట్లాడుతున్న జెసి అభిషేక్

ప్రజాశక్తి -యంత్రాంగం

పాడేరు : డ్రగ్స్ దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించి, వాటి జోలికి పోకుండా చర్యలు చేపట్టడమే కాకుండా వాటి నియంత్రణ లక్ష్యంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాలను మహిళాభివద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. జేసి మాట్లాడుతూ దేశప్రగతిని ముందుకు తీసుకెళ్లవలసిన విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్ మాట్లాడుతూ కేంద్ర సోషల్ జస్టిస్ ఎంపవర్మెంట్ శాఖ, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా చేపట్టిన అవగాహనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డిఇఒ పి. బ్రహ్మాజీ, గిరిజన సంక్షేమ డిడి ఐ. కొండల రావు, ఎటిడబ్ల్యుఒ ఎల్. రజని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్ చార్జ్ ప్రిన్సిపాల్ డా. వి.రమేష్ బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ డి. గణేష్, జి. గౌరిశంకర్ రావు, జి. దామోదర్‌రావు, తహసిల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిడిఓ సాయినవీన్, ఎస్‌డిసి వివిఎస్ శర్మ, పాల్గొన్నారు.

అరకులోయ: యువత జీవితాలను, భవిష్యత్‌ను హరిస్తున్న గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాలను సమూలంగా నిర్మూలించాలని కోరుతూ అరకులోయ మండల కేంద్రంలో సోమవారం మండలంలోని వివిధ పాఠశాల, కళాశాలల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కేంద్రీకృత ఆశ్రమ పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పోలీస్‌స్టేషన్, టౌన్ షిప్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకుకొనసాగింది. అరకులోయ ఎంఇఒలు వి త్రినాధరావు, భారతిరత్నం ఆధ్వర్యంలో గంజాయి వద్దు- జీవితం ముద్దు అంటూ విద్యార్థులు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం నిర్మింఆరు.

ఈ సందర్భంగా ఎంఇఒ త్రినాధరావు మాట్లాడుతూ, గంజాయికి ఆకర్షితులై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తుకు బానిసలైతే చదువులకు దూరమవడమే కాకుండా, వారి ఉజ్వల భవిష్యత్తును పాడవుతందున్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు విద్యార్థులు, యువత దూరంగాఉండాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ఆయా పాఠశాలలఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతపల్లి: మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చింతపల్లి ఎంపిడిఒ సాయిబాబా పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కేంద్ర ప్రభుత్వ నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల రహిత భారత దేశాన్ని రూపొందించడానికి విద్యార్థులు యువత సహకరించాలని కోరారు. విద్యార్థి దశలో, యుక్త వయసులో చెడు వ్యసనాలకు బానిస కావద్దని, చక్కగా చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

చింతపల్లి : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనిచింతపల్లి అదనపు ఎస్ఐ ఎం వెంకటరమణ అన్నారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో విద్యార్థులకు మత్తు పదార్థాలు గంజాయి క్రయ విక్రయాల అనర్థాలపై అవగాహన కల్పించారు. డబ్బులు, ఇతర ప్రలోభాలకు లొంగి తాత్కాలిక ప్రయోజనాలకు కక్కుర్తిపడి, గంజాయి, డ్రగ్స్ రవాణా, వాడకంలో భాగస్వాములై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ప్రభుత్వ విద్యాపథకాలను అందిపుచ్చుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినుముల శ్రీనివాస్ పాత్రుడు, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఒ

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- అరకులోయ : పర్యాటక కేంద్రమైన అరకులోయలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. 20 రోజులుగా కురిసిన భారీ వర్షాలకు టౌన్‌షిప్‌లోని మెయిన్ రోడ్డు డివైడర్లలో భారీగా పిచ్చిమొక్కలు తుప్పలు పెరిగిపోవడంతో పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాస్ బాబు, ఇఒ రాజ్‌కుమార్ స్వీయపర్యవేక్షణలో తొలగించారు. టౌన్ షిప్‌లోని వ్యాపారులు తమ దుకాణాల ముందు డస్ట్ బిన్ విధిగా ఏర్పాటు చేసుకోవాలని సర్పంచ్, ఇఒ సూచించారు. రోడ్లపై చెత్త చెదారం వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లను అక్రమించేలా దుకాణాలను విస్తరించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోక తప్పదనిస్పష్టం చేశారు.

అరకు లోయలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని పలుమార్లు దుకాణాల యజమానులకు హెచ్చరించినా పట్టించుకోవడం లేదని, పట్టుబడితే కేసులు తప్పవన్నారు. ప్లాస్టిక్ రహిత అరకులోయ లక్ష్యసాధనలో ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఇకపై ఎవరైనా ప్లాస్టిక్‌ను విక్రయించినా, ప్లాస్టిక్ కవర్లతో నిత్యవసర సరుకులు ఇచ్చినా, అటువంటి వారిపై కేసులు పెట్టడమే కాకుండా, జరిమానావిధిస్తామని, దీనికి వ్యాపారులే బాధ్యులన్న విషయాన్ని గుర్తించాలని సర్పంచ్ దాసుబాబు, ఈవో రాజకుమార్ హెచ్చరించారు. డ్రైనేజీలు ఆక్రమణలు, అక్రమనిర్మాణాలను తొలగించేందుకు పంచాయతీ కంకణం కట్టుకుందన్నారు. ప్రస్తుతం ఎపిడిమిక్ సీజన్ కావడంతో దుకాణదారులు పరిశుభ్రం పాటించవలసిన ఆవశ్యకత ఉందన్నారు.క్లీన్ అరకులోయకు ప్రతి ఒక్కరు సహకరించాలనికోరారు. ప్రభుత్వ,పంచాయితీ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పదని హెచ్చరించారు.

డివైడర్ మధ్య పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

అవగాహన కల్పిస్తున్న పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర

పోస్టల్ పథకాలపై అంగన్వాడీలకు అవగాహన

ప్రజాశక్తి- అరకులోయ: మహిళలకు, ఆడపిల్లలకు అందుబాటులో ఉన్న పోస్టల్ పథకాలపై అంగన్వాడీ కార్యకర్తలకు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బి.ఉపేంద్ర అవగాహన కల్పించారు. పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశాల మేరకు అరుకు మండల పరిషత్ కార్యాలయం సమావేశమందిరంలో సిడిపిఒ శారద ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాజెక్టు సమావేశంలో ఉపేంద్ర పాల్గొని పోస్టల్ పథకాలు గురించి వివరించారు. ముఖ్యంగా ఆడపిల్లలకు సుకన్య సమద్ధి యోజన అకౌంట్, అదేవిధంగా పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌పై వివరించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకొని ఈనెల14న అరకు సబ్ డివిజన్లోని 4 మండలాల్లోని 77 పోస్టాఫీసుల్లో ప్రమాద బీమా పాలసీల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబోతున్నట్లు తెలిపారు. అనేక ప్రయోజనాలున్న ఈ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఎస్‌టిఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (యస్‌టిఎఫ్ఐ) 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను కె రాంబాబు ఆవిష్కరించారు. అనంతరం అల్లూరి జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావు మాట్లాడుతూ స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయిలో 30 అనుబంధ సంఘాలు కలిగి, 13 రాష్ట్రాలలో శాఖలు కలిగి బలమైన సంఘంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో ఒపిఎస్ సాధనకు రెండు దశాబ్ధాలుగా ఈ సంఘంఉద్యమిస్తోందన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

పాడేరులో జెండాను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి పాడేరు : పాడేరులో ఐటిడిఎ క్వార్టర్స్‌లోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో సోమవారం ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా కమిటీ ఆధ్వర్యంల్లో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కొర్రా కార్తీక్ జెండావిష్కరణ చేసారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యుడు పాంగి చిన్నారావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కార్తీక్ మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, విద్య ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆదివాసీ ప్రాంత విద్యాభివృద్ధికి భవిష్యత్తు పోరాటాలలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, గణపతి తదితరులు పాల్గొన్నారు ..

చింతపల్లిలో ...: చింతపల్లి మండల కేంద్రంలో ఏపీఆర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా కార్యదర్శి పి. జీవన్‌కృష్ణఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అన్నారు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె. చిరు కె. నవీన్, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: పాఠశాల, విద్యా సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని ఈ సంఘం మండల అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి కృష్ణ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జెండాను మండల అధ్యక్షుడు గణేష్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వమే 1936 ఆగస్టు 12న ఆవిర్భవించిన ఎస్ఎఫ్ఐ, నేటికీ విద్యాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెల్త్ వాలంటీర్లను నియమించాలని విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా వర్కర్లు, వాచ్‌మెన్, ఇతర సిబ్బందిని నియమించాలన్నారు. జిఒ 3ను పునరుద్ధరించి, ఏజెన్సీలో శతశాతం విద్యా, ఉద్యోగ ప్రయోజనాలను స్థానిక గిరిజనులకు వర్తింపజేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లుల చెల్లింపుతోపాటు మెస్ ఛార్జీలు రూ 3 వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కమిటీ సభ్యులు జీవన్ ,ఇమ్మానుయేల్, వంశీ, దిలీప్, దేవుడు విద్యార్థులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వినతులు స్వీకరిస్తున్న పిఒ కట్టా సింహాచలం

పబ్లిక్ గ్రీవెన్స్‌కు 47 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్)కు 47 అర్జీలు అందాయి. వీటిని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, ఏపీఓ జనరల్ సి హెచ్.శ్రీనివాసరావు స్వీకరించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్‌కు అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కె.దేవేంద్రుడు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ బాబురావు, తాసిల్దార్ కృష్ణ జ్యోతి, ఏడియంహెచ్ఓ జి.శిరీష, వెలుగు ఏపిడి ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ ఇందిరా, డియల్‌డిఓ కె.కోటేశ్వరరావు, జి.డేవిడ్ రాజ్, ఎండి.యూసఫ్, రవికుమార్, ఏఎంఓ సి.శ్రీహరి, డిప్యూటీ తాసిల్దార్ శ్రీధర్, స్వామి, రవీంద్రబాబు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

'ఆ వ్యక్తిని ఎంఇఒగా నియమించడం సరికాదు'

ప్రజాశక్తి- కూనవరం : ఆర్థికపరమైన ఆరోపణలు ఎదుర్కొని రెండు సార్లు సస్పెండైన వి.లక్ష్మీనారాయణను మరో సారి కూనవరం మండల విద్యాశాఖాధికారిగా నియమించడం సరికాదని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేశ్వరరావు, కన్నారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీని వల్ల మిగిలిన వారు కూడా ఆర్థిక నేరాలకు పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. గతంలో ఆయన ఎదుర్కొన్న ఆర్థిక పరమైన విషయంలో ఎటువంటి రికవరీ చర్యలు తీసుకోలేదని, మరో సారి ఇన్‌ఛార్జి ఎంఇఒగా నియమించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ మేరకు అమలాపురంలో జరిగిన రాష్ట్ర విద్యా సదస్సులో లక్ష్మీనారాయణపై ఉన్న అవినీతి ఆరోపణలపై అల్లూరి జిల్లా డిఇఒకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. తక్షణమే మరోసారి విచారణ జరిపి ఆర్థిక పరమైన వ్యక్తి గత భీమా పాలసీలకు సంబంధించిన డబ్బులు, పాఠశాల గ్రాంట్స్, కాంప్లెక్స్ గ్రాంట్స్ రికవరీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

90 శాతం సబ్సిడీతో గోకులాలు మంజూరు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : పశువుల సంరక్షణ కోసం గిరిజనుల రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో 25 మినీ గోకులాలు మంజూరు చేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ వీరేంద్ర తెలిపారు. అర్హులైన గిరిజన రైతులు సకాలంలో సచివాలయంలో ఆర్జీలు పెట్టుకోవాలని సూచించారు. గోకులాలు నిర్మాణాలు చేస్తే ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లులు చెల్లించబడతాయని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంక్ పాసు బుక్, కుల ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాస్ బుక్, ఉపాధి జాబ్ కార్డు నకళ్లు జత చేసి స్థానిక పశువైద్య శాలలో ఇవ్వాలన్నారు. దరఖాస్తులు గ్రామ సచివాలయం అందుబాటులో ఉంటాయని తెలిపారు.

28 నుంచి పోర్టులో నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ పోర్టులోనున్న అన్ని కార్మిక సంఘాలు ఉమ్మడిగా ఎన్‌సిసి పిలుపుమేరకు ఈ నెల 28న లేదా ఆ తరువాత ఎప్పుడైనా డిమాండ్ల సాధనకు నిరవధిక సమ్మెకు దిగనున్నట్టు పోర్టులోని అన్ని కార్మిక సంఘాల నాయకులు స్పష్టం చేశారు. సోమవారం పోర్టు డిప్యూటీ చైర్మన్‌కు వారు ఉమ్మడిగా సమ్మె నోటీసులు అందజేశారు. సమ్మె నోటీస్‌తో పాటు పలు డిమాండ్లను పేర్కొంటూ వినతిపత్రం కూడా సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 జనవరి నుండి షరతులు లేని కొత్త వేతన ఒప్పందం చేయాలని కోరారు. బోనస్ బకాయిలను, కొత్త బోనస్‌ను వెంటనే చెల్లించాలని, నేషనల్ ఎసెట్స్ మానిటైజేషన్ పైపులైన్ (ఎన్ఎఎంపి) పథకం కింద మేజర్ పోర్టుల బెర్తులు, ఆస్తుల అమ్మకాన్ని ఉపసంహరించాలని కోరారు. పోర్టుల్లో టెక్నికల్, ఆపరేషనల్, మినిస్టీరియల్ అన్ని ఎంట్రీ లెవెల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు.

'స్థానిక' బరిలో టిడిపి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలోకి టిడిపి దూకింది. నిన్న మొన్నటి వరకూ అభ్యర్థిని నిలపాలా ? వద్దా ? అన్న అంశంపై తర్జనభర్జనలు పడ్డ ఆ పార్టీ సోమవారానికి ఓ నిర్ణయానికి వచ్చింది. పారిశ్రామికవేత్త బైరా దిలీప్ చక్రవర్తిని పార్టీ అభ్యర్థిగా దాదాపు ఖరారు చేసినట్టు తెలిసింది. ఈ ఉప ఎన్నికలో అభ్యర్థిని నిలబెట్టడంలో వైసిపి తొలి నుంచీ ముందు చూపుతో వ్యవహరించింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరును ప్రకటించడం, నామినేషన్ కూడా వేయడం చకచకా జరిగిపోయాయి. మంగళవారం నామినేషన్ల సమర్పణకు చివరితేదీ కావడంతో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పలు కసరత్తుల అనంతరం బైరా ఫౌండేషన్ అధినేత, అనకాపల్లికి చెందిన దిలీప్ చక్రవర్తిని ఖరారు చేసినట్టు తెలిసింది. గత ఎన్నికల సందర్భంగా అనకాపల్లి పార్లమెంట్ స్థానాన్ని ఆశించిన బైరా ఆ ప్రాంతంలో పలు సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు కొంత చేరువయ్యారు. అనూహ్యంగా అనకాపల్లికి బిజెపి తరపున ఎంపీ అభ్యర్థిగా సిఎం రమేష్‌ను కూటమి అభ్యర్థిగా ప్రకటించాక బైరా దిలీప్ ఛాన్స్ మిస్ అయ్యిందన్నది తెలిసిందే. ఇదిలా ఉండగా మంగళవారం బైరా దిలీప్ చక్రవర్తి నామినేషన్ వేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

బైరా దిలీప్ చక్రవర్తి

అభ్యర్థిగా బైరా దిలీప్ చక్రవర్తి
నేడే నామినేషన్

సరిపడా బలం లేకపోయినా..

2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక ఎంపిటిసి, జెడ్‌పిటిసి, కార్పొరేటర్ స్థానాలను దక్కించుకున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వీరి ఓట్లే కీలకం కానుండడంతో వైసిపి ధీమాగానే ఉంది. మొత్తంగా ఎంపిటిసి, జెడ్‌పిటిసి, కార్పొరేటర్ల ఓట్లన్నీ కలిపితే ఉమ్మడి విశాఖ జిల్లాలో 838 మేర ఉన్నాయి. వీటిలో 530కి పైగా ఓట్లు వైసిపికి ఉన్నాయి. సుమారు 300 ఓట్లు తేడా వైసిపికి, టిడిపికి మధ్య ఉంది. అయితే 2024 ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించడంతో చంద్రబాబు ఈ ఎమ్మెల్సీ ఎన్నికపై దృష్టిసారించారు. పార్టీగా ఓట్లు సరిపడా లేకపోయినా సరే అనేక మంది ప్రజాప్రతినిధులు వైసిపి నుంచి కూటమి పార్టీల్లోకి వచ్చే అవకాశాలున్నాయన్న సంకేతాలను కింది స్థాయి నాయకులు ఆయనకు అందజేశారు. బొత్స కాపు సామాజిక తరగతి కాబట్టి బైరా దిలీప్ చక్రవర్తి ధీటైన అభ్యర్థి కాగలరని చంద్రబాబు భావిస్తున్నారు. వాస్తవానికి బైరా దిలీప్ చక్రవర్తి తొలినుంచీ ఎమ్మెల్సీ పదవిపై సుముఖంగా లేరు. తాజా పరిణామాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం సూచన ప్రాయంగా ఎంఎల్‌సి స్థానం విషయమై పోటీకి అంగీకారం తెలిపినట్లు సమాచారం.

వేర్వేరు శిబిరాల్లో ప్రజాప్రతినిధులు

స్థానిక ఓటర్లకు ఇప్పటికే వైసిపి, టిడిపి కూటమి వేర్వేరుగా శిబిరాలు నిర్వహిస్తున్నాయి. గండి బాబ్జీ, పీలా గోవింద్ ఇద్దరికీ ఎంఎల్‌సి పదవిపై ఆశ ఉన్నా రూ.కోట్లు ఖర్చుపెట్టాల్సి రావడం, చివర నిమిషం వరకూ అధిష్టానం తేల్చకపోవడంతో వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు ఆర్థికంగా పెద్ద హైరానా పడాల్సిన అవసరం ఉండదని, సహజ సిద్ధంగానే కూటమి వైపు వైసిపి ప్రజాప్రతినిధులు ఆకర్షితులౌతారని టిడిపి నేతలు చెబుతున్నారు.

విద్యార్థులతో కలిసి తరగతి గదిలో కూర్చున్న పిఒ

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. మారేడుమిల్లి మండలం దేవరపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సోమవారం ప్రాజెక్టు అధికారి ఆకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ముందుగా విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందిస్తున్నారా? లేదా? విద్యను ఎలా బోధిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలన్నారు. విద్యార్థులు అనారోగ్యంగా ఉంటే వెంటనే దగ్గర్లో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్ళి వెళ్లి వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన క్లాస్ రూమ్‌లో కూర్చొని పరిశీలించారు. ఆశ్రమం పాఠశాలల్లో దోమలు ప్రబలగుండా మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండే విధంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలకు నిత్యవసర వస్తువులు, పాలు, కోడిగుడ్లు, కోడి మాంసం వెండర్లు ఏవిధంగా సరఫరా చేస్తున్నారో ఆరా తీశారు. ప్రాజెక్టు అధికారి వారి వెంట ప్రధానోపాధ్యాయులు డి. నాగేశ్వరరావు తదితరులున్నారు.

దుర్గంధంతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి- హుకుంపేట:మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలంలో దుర్గంధభరిత పరిస్థితులపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న గొయ్యిలో నీరు నిండిపోవడంతో ఇప్పటికే అక్కడ వేసిన చెత్తాచెదారం కుళ్లి దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. అంతేకాక పక్కనే అంగన్వాడీ సెంటర్, హౌసింగ్ కాలనీ వాసులు తాగునీటిని వినియోగించి బోరు ఉంది. గొయ్యిలోని దుర్గంధభరిత నీరు, క్షీణించిన పారిశుధ్యంతో బోరుకు వచ్చి నీరు తీసుకెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడడమే కాకుండా, పక్కనే మురుగుగుంట ఉండడంతో బోరులోని నీరు కలుషితమయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ కార్యాలయం ఎదుటే ఇలా అపారిశుధ్యం, అనారోగ్యకర పరిస్థితులున్నా పంచాయతీ పాలకవర్గంగానీ, సంబంధిత అధికారులుగానీ పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు. తక్షణం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్తాచెదారం

డిసెంబర్ 15న నేవీ మారథాన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్ నేవీ మారథాన్‌ను డిసెంబర్ 15న నిర్వహించనున్నట్టు వైజాగ్ నేవీ మారథాన్ రేస్ డైరెక్టర్ కమాండర్ ప్రదీప్ పటేల్ వెల్లడించారు. సోమవారం సాయంత్రం డాల్ఫిన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైజాగ్ నేవీ మారథాన్ 9వ ఎడిషన్‌కు సంబంధించిన వివరాలను తెలియజేశారు. విశాఖ నగరం రన్నింగ్, సరికొత్త క్రీడా ప్రపంచం దిశగా దూసుకు వెళ్లాలనే లక్ష్యంతో ఈ మారథాన్ నిర్వహిస్తున్నామన్నారు. 2014 నుంచీ దీన్ని చేపడుతున్నట్టు తెలిపారు. 9వ ఎడిషన్ వైజాగ్ నేవీ మారథాన్‌లో పాల్గొనాలనుకునేవారు vizagnavy-marathon.runలో రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 15 నుంచి అధికారికంగా ప్రారంభమవుతుందని తెలిపారు. మారథాన్‌లో పాల్గొనే వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోందన్నారు. మొదటి ఎడిషన్ 1800 మందితో ఆరంభమవగా ఆ సంఖ్య ఎనిమిదో ఎడిషన్‌కు వచ్చేసరికి 12 వేలకు చేరిందన్నారు. ఈ ఏడాది మారథాన్ కేటగిరీలకు సంబంధించి 42 కిలోమీటర్ల ఫుల్ మారథాన్, 21 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల మారథాన్‌లు ఉంటాయన్నారు. ఈ ఏడాది 20 వేల మంది పాల్గొనే అవకాశముందన్నారు. 18-35 ఏళ్లు, 35-55 ఏళ్ల వారిని రెండు విభాగాలలో మహిళలు, పురుషుల కింద రెండు కేటగిరీలుగా విభజించి మారథాన్ చేపడతామన్నారు. విశాఖలోని పలు స్కూల్స్‌కు చెందిన విద్యార్థులు రూపొందించిన టీ షర్టులను రన్నర్‌లకు అందించనున్నట్టు తెలిపారు. జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారి ఆరోగ్య పరిరక్షణ, స్నేహ భావం పెంపొందించేందుకు ఈ మారథాన్ ఉపయోగపడుతుందని అన్నారు. అన్ని విధాలుగా సహకరిస్తామని తెలిపారు. సమావేశంలో రేస్ డైరెక్టర్ టిఆర్ఎస్.కుమార్, నేవీ డిఫెన్స్ పిఆర్ఒ కెప్టెన్ సిజి.రాజు, ఐఎన్ఎస్ కళింగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వికె.తివారీ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు, జివిఎంసి కమిషనర్